



**అత్తగారు నూతి పళ్ళెంలో కూర్చుని ఆ కంచు మరచెంబుని చింతపండుతో తళతళలాడేలా తోముతూంటే సావిత్రి వొళ్ళు భగ్గుమని మండిపోయింది.**

ఆవిడ కాపురానికి వెళుతుంటే తల్లి ప్రయాణంలో మంచినీళ్ళు ఉండాలంటూ అత్యంత ఆప్యాయంగా ఇచ్చిందట ఆ మరచెంబుని అంతే ఆ క్షణం నుంచీ ఆవిడకా మరచెంబు అంటే ప్రాణప్రదం అయిపోయింది.

భోజనాల దగ్గర నుంచీ పడకటింటి వరకూ అదొక ప్రత్యేకమైన స్థానం ఆక్రమించుకుంది ఆమె జీవితంలో

మావగారు పోయాక వెనుకటి జ్ఞాపకాలకు మరీ ఆధారమై పోయిందా మరచెంబు ఆవిడకు.

కనీసం వారానికి ఒకసారైనా దాన్ని శుభ్రంగా తోమి ఎదురుగా ఉంచుకుంటేనే కాని ఆవిడకు తోచదు.

ఆ మరచెంబు అంటే ఆవిడకు అంతులేని మమకారం.

సావిత్రికి మాత్రం దాన్ని చూస్తుంటే భలే కోపం. గుండ్రాయిలాంటి దాన్ని చూస్తుంటే మోటుగా అసహ్యంగా అనిపిస్తుందామెకి అయినా అందమైన స్టీలు సామగ్రి ఫేషన్ అయిన ఈ రోజుల్లో అత్తగారు ఆ కంచు మరచెంబుని పట్టుకుని వ్రేలాడటం ఆమెకి సుతరాము నచ్చలేదు

పైగా దాన్ని తోమటానికి కనీసం వారానికి ఓ పంపు చింతపండు దండుగ ఖర్చు ఒకటి

అక్కడికీ ఒకసారి అత్తగారితో మంచిగానే-"ఏమిటత్తయ్య ఆ మరచెంబుని పట్టుకుని వ్రేలాడతారింకాను. హాయిగా మార్చేసుకుని ఓ స్టీలు మరచెంబు తీసుకోకూడదూ?... అదీకాక ఏ అర్ధరాత్రైనా చేయి జారి కాలి మీదో, చేతి మీదో పడితే ఇంకేమైనా ఉందా... ఎందుకొచ్చిన అవస్థలు చెబుదురూ?" అంది సావిత్రి.

ఆ మాటలకు ఆవిడ ఫక్కుమని నవ్వేసి- "అమ్మో... దాన్ని మార్చెయ్యటమే?... వద్దు తల్లీ... వద్దు... మీ మామగారు విడిచిపోయినప్పట్నుంచీ అదే నాకు తోడైంది. దాన్ని కళ్ళ ముందు ఉంచుకునే కాలం కడ తేర్చుకోని" అంది.

సావిత్రి ఇక ఏం అనలేకపోయింది.

ప్రక్కకి వెళ్ళి పళ్ళు మాత్రం పిండుకుంది.

పిల్లలు నాయనమ్మ దగ్గర చేరి కబుర్లాడుతూ హాస్యంగా- "ఏం నాయనమ్మా... ఈ మరచెంబుని మోయటానికి తాతయ్య రోజూ కసరత్తు చేసేవాడా?" అంటూ అడిగితే-

"పొండిరా బడవాయిలూ . ఆ రోజుల్లో తిళ్ళు వేరు... మనుషుల ఓపిక వేరు. మీలా పిట్ట తిండి తిని బక్కరాయుళ్ళుల్లా ఉండేవారకునే వారేమిటి?" అనేది వాళ్ళ బుగ్గల్ని ముద్దుగా చిదుముతూ ఆవిడ.

అది ప్రక్క గదిలో భర్తకి ఏ కాఫీయో, టీనో అందిస్తున్న సావిత్రి వింటూ- "ఆ దిక్కుమాలిన మరచెంబుని మోయటానికి ఆయనగారు ఆస్తి అంతా హరించుకు పోయేలా ఆబగా ఘటోద్కజాడి తిండి తినటం... ఆ సంగతి సిగ్గు లేకుండా చెప్పుకోవటం .. చీ.. చీ" అని చీత్కరించుకునేది.

అతనికీ విషయం మామూలే కనుక ఏం పట్టించుకోకుండా తన ధ్యాసలో తనుంటే-

"ఏవండీ... నేను మళ్ళీ చెబుతున్నాను... ఆ దిక్కుమాలిన శనిగొట్టు మరచెంబుని నేను భరించలేను. దాన్ని ఏ కాలువలో నో, చెర్లోనో విసిరేసి రండి" అనేది అతను మౌనానికి వొళ్ళు రగిలిపోతూంటే.

అప్పటికీ అతను మాట్లాడేవాడు కాదు

సావిత్రి మరీ రెచ్చిపోయేది.

"ఛీ ఇంటికెవరు వచ్చినా దాన్ని చూసి నవ్వటమే. మొన్న హైదరాబాద్ నుంచి మా ఫ్రెండ్ రాజీ వచ్చినప్పుడు దాన్ని చూసి ఏమందో తెలుసా?.. ఏమే... ఆ గుండు చెంబు నాకు ఇవ్వకూడదూ.. తీసుకెళ్ళి సాలార్‌జంగ్ మ్యూజియంకి అమ్మేస్తాను మూడో పులకేసి తాతగారిదని చెప్పి.... అంటూ పకపకమని నవ్వటం మొదలుపెట్టింది తెల్సా?" అంది మరింత ఉక్రోషంగా

"ఏమిటి సావిత్రీ ఆ చిందులు?... అమ్మకి ఆ మరచెంబు ప్రాణం. దాన్ని ఆవిడ నుంచి ఎలా దూరం చేస్తావ్?" అంటూ విసుక్కుని అక్కడి నుంచి లేచి వెళ్ళిపోయే వాడు సావిత్రిలో కోపంకి మరింత ఆజ్యం పోస్తూ.

ఒకసారి మాత్రం సావిత్రి బాగా గట్టిగా నిశ్చయించుకుంది ఆ మరచెంబు పీడ వదుల్చుకోవాలని. ఆ అవకాశం కూడా అలాగే వచ్చిందామెకు.

అత్తగారు ఓ పది రోజులు ఖాయిలా పడటం జరిగింది. ఆ పది రోజులు ఆవిడ ఈ లోకంలో లేదనే చెప్పాలి. మగతగా పడుకుని మరో లోకంలో ఉండేది.

భర్తా, పిల్లలూ ఇంట్లో లేని సమయం చూసి అత్తగారి మంచం ప్రక్కన ముక్కాలిపీట మీద నున్న మరచెంబుని తీసి వీధిలోకి వచ్చిన ఇత్తడి సామాను వాడికి అమ్మేసి... వెంటనే బజారు వెళ్ళి ఓ స్టీలు మరచెంబూ, నాలుగు టిఫిన్ ప్లేట్లు కొని తెచ్చింది.

అప్పుడుగాని ఆమె హృదయం తేలికపడలేదు.

బామ్మగారి కంచు మరచెంబుని గురించి అడిగిన పిల్లల్ని గుడ్లురిమి చూసి నోళ్ళు మూయించింది.

మరచెంబు గురించి ప్రశ్నించిన భర్త మాటలు వినపడనట్లు నటించి కొత్తగా కొన్న స్టీలు మరచెంబూ, స్టీలు గ్లాసూ తెచ్చి చూపించి "బాగున్నాయి కదూ?" అంది ముచ్చటగా సావిత్రి.

"రాక్షసి" అనుకున్నాడు అతను లోలోపలే నిస్సహాయంగా.

సావిత్రి అత్తగారి ఆరోగ్యం కుదుటపడింది. ఆవిడకు తన మంచం ప్రక్కన ఉండవలసిన మరచెంబు కనపడలేదు.

కొడుకు ముఖం చాటు వేయటం-

మనవలు జాలిగా చూడటం-

కోడలు తను చూస్తుండగా స్టీలు మరచెంబు బీరువా నుంచి తీసి కొడుకు పిస్తోరి ప్రక్కన పెట్టడం-

చెప్పకనే మరచెంబు ఏమైందో విషయమర్థి చెప్పాయి. ఆవిడ గుండెలు బరువెక్కాయి... దుఃఖంతోనూ, బాధతోనూ, బెంగతోనూ- భర్త పోయినప్పటి శూన్యత మళ్ళీ మరచెంబు కనపడక పోవటంతో ఆమెని ఆవరించింది.

ఏదో తోడు కోల్పోయినట్లు అనిపించసాగింది ఆవిడకు.

క్రమంగా మళ్ళీ క్షీణించింది ఆవిడ ఆరోగ్యం. రాత్రీ- పగలూ మరచెంబునే కలవరించిందావిడ. అలా కలవరిస్తూనే ఆవిడ ఓ రోజు కన్నుమూసింది.

ఆమె మరణం సావిత్రిని భర్త దృష్టిలోనూ- పిల్లల దృష్టిలోనూ నేరస్థురాల్ని చేసింది. చాలా రోజులు ఆవిడ్ని వాళ్ళు అదో మాదిరి చూపులతో వేధించేవారు.

కాలం మరింత ముందుకు సాగింది.

సావిత్రి భర్త హఠాత్తుగా మరణించాడు.

కూతురు పెళ్ళయి కాపురానికి వెళ్ళిపోయింది.

కొడుక్కి పెళ్ళయి కాపురానికి వచ్చింది కోడలు.

వస్తూనే మార్పులూ- చేర్పులూ మొదలు పెట్టింది.

ఆమె చూపు మొదటగా పడింది ఆ ఇంట్లో ఉన్న పెద్ద సైజు పందిరపట్టె మంచం మీద.

"ఏమిటండీ ఈ దయ్యం మంచం?... నిచ్చెన వేసుకుని ఎక్కాలా ఏమిటి?" అని విసుక్కుంది ఆ కొత్త కోడలు.

సావిత్రి మనస్సు చివుక్కుమంది.

"అదేమిటమ్మా... అది మా పుట్టింటి వాళ్ళిచ్చిన మంచం. దాన్ని దయ్యం, భూతం అంటావేమిటి?" అంది సావిత్రి నొచ్చుకుంటూ.

కోడలు సమాధానం చెప్పలేదు.

మూతి మూడు వంకర్లు తిప్పి అక్కడ నుంచి లోపలకు వెళ్ళిపోయింది.

ఆ తర్వాత ఓ రోజు సాయంకాలం గుడికి వెళ్తున్న సావిత్రికి కొడుకుతో కోడలు అంటున్న మాటలు వినిపించి గుమ్మం దగ్గరే ఆగిపోయింది.

"ఏమండీ... ఆపాత మంచం గదంతా ఆక్రమించి ఇరుగ్గా తయారయ్యిందండి... దాన్ని మార్చేసి హాయిగా ఓ డబుల్ కాట్ కొందామండీ. ఫేషన్‌గానూ ఉంటుంది... గదిలో కాస్తంత స్థలమూ మిగులుతుంది" అంటోంది కోడలు.

"ఏం చెప్పమంటావ్ గిరిజా?... అమ్మ బాధపడుతుందేమోనని ఆలోచిస్తున్నాను", అంటున్నాడు కొడుకు.

"ఆవిడ బాధపడతారని నన్ను ఆ దయ్యం మంచంతో యాతన పడమంటారా?... నా వల్ల కాదు". అంటోంది కోడలు.

నీరసంగా నిస్సత్తువగా లోపలికి వచ్చి తన గదిలో ప్రవేశించి మంచం ప్రక్కన ఉన్న స్టీలు మరచెంబు అందుకుంది మంచినీళ్ళు త్రాగటానికి.

ఆ మరచెంబుని చూస్తుంటే గతం గుర్తుకు వచ్చిందామెకు. దాని కోసం కంచు మరచెంబుని అమ్మేసినప్పుడు అత్తగారు పడిన వేదన మనసులో మెదిలి సావిత్రికి కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి. తన తండ్రి కొత్త కాపురానికి ఇచ్చిన తాతలనాటి పందిరి మంచం అంటే తనకి ఉన్న మమకారమే ఆవిడకు ఆ కంచు మరచెంబు పట్ల ఉండేదని తెలుసుకోడానికి ఎంత కాలం పట్టిందని?


తను చేసిన అపచారానికి మనసులోనే చెంపలు వేసుకుంది సావిత్రి అత్తగారిని స్మరించుకుంటూ.

కోడలు ఆ మంచం జోలికి కనీసం తను బ్రతికి ఉండగానైనా పోకుండా ఉంటే బాగుండునని వెయ్యి దేవుళ్ళకి మొక్కుకుంది సావిత్రి.

అయితే ఆమె ప్రార్థన ఏ దేవుడి చెవిన పడలేదు.

ఒక రోజు మధ్యాహ్నం పొరుగింటి ఆమెతో ఊళ్ళోకి వచ్చిన స్వాముల వారిని చూసేందుకు వెళ్ళి సాయంకాలం తిరిగి ఇంటికి వచ్చిన సావిత్రికి వడ్రంగి తనకి అత్యంత ప్రియమైన పందిరిమంచాన్ని విడదీసి రంపంతో కోస్తూ కనిపించాడు.

ఆ కోత మంచానికి కాకుండా తన గుండెనే అన్నంత బాధపడింది సావిత్రి. ఆ దృశ్యం మరింక చూడలేని సావిత్రి అలాగే నేల మీదకు వాలి పోయింది.



# ఇదండీ! పద్మ మహల్!

అలనాడు శ్రీకృష్ణదేవరాయలవారి కాలములో, ఆయన పాలనలో ఆంధ్ర దేశము మూడు పువ్వులు ఆరు కాయలుగా వెలిగిపోయింది. విద్యానగరిలో అత్యంత విలువ గల రత్నాలు అంగళ్ళలో అరుబయట అమ్మేవారట. ప్రజలు చింతాకంత చికాకు లేకుండా హాయిగా కాలము వెళ్ళబుచ్చారు.

మరి నాటి రాజకుటుంబీకులు, ప్రత్యేకించి అంతఃపుర కాంతలు, కాలమునే పాలరాతి భవనాల్లో పట్టు పాన్పులపై వర్తించేవారు. ఉబుసుపోకకు సాయం సమయాల్లో కులాసాగా కబుర్లు చెప్పుకుంటు కాలము గడపడానికి, కళలకు కాణాచిగా నిలిచిన సుందర మందిరాల్లో విహరించేవారు. అలాంటి విహార భవనమే పద్మమహల్. రెండంతస్తులున్న ఈ విలాస భవనాన్ని రెండడుగుల ఎత్తున్న రాతివేదికపై కాల్చిన ఇటుక, 'పాలంగార'లతో నిర్మించారు. అది యిప్పటికీ గత వైభవాలకు దర్పాలకు, హోదాలకు ప్రతీకగా నిలిచి, పర్యాటకుల నానంద పరుస్తుంది; గత స్మృతుల నెమరు వేసుకుంటూ నిలిచి వుంది. దీన్ని పద్మ పుష్పములా నిర్మించడము చేత దీనికా పేరు వచ్చింది. దీనిలో మండు వేసవిలో సయితం నిండు పున్నమినాడు, మంచుపల్లకిలో నున్న అనుభవము కలిగిస్తుంది. ప్రక్కనున్న అంతఃపురం నామరూపాలు లేకుండ నశించి పోయినా, పద్మమహల్ మాత్రం పర్యాటకుల నానంద పరుస్తూ కాలగమనానికి తట్టుకొని నిలబడివుంది.

—శ్రీమతి పి. విజయలక్ష్మీరెడ్డి